క్లుప్తంగా

ముగిసిన వేలంపాటలు



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో బుధవారం ఆలయ మాన్యం భూముల వేలం పాటలు ముగిశాయి. శ్రీరామ, ఈశ్వర, ఆంజనేయ, నాంచారమ్మ దేవస్థానాలకు చెందిన 35 ఎకరాలకు కార్యనిర్వహణాధికారి వెంకటరమణ వేలంపాటలు నిర్వహించారు. గతంలో రూ.3లక్షలకు వేలం పాటలో భూములు దక్కించుకున్న రైతులు ఈ ఏడాది రూ.2.48 లక్షలకే పాటపాడారు. కార్యక్రమంలో సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, పర్యవేక్షణాధికారి హరిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మేట్ లకు శిక్షణ



మేట్‌లకు శిక్షణ ఇస్తున్న ఏపీఓ నాగజ్యోతి

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి మేట్‌లకు బుధవారం ఏపీఓ నాగజ్యోతి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి పనులు ప్రారంభమయ్యాయని, ప్రతి మేట్ ఉపాధి కూలీలను రిజిస్టర్‌లో అటెండెన్స్ తీసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీలకు అన్ని వసతులు కల్పించాలన్నారు.

అనారోగ్యంతో బైరాపురం సర్పంచు మృతి



ఫణిభూషణ్‌రెడ్డి

నందికొట్కూరు: మిడుతూరు మండల పరిధిలోని బైరాపురం గ్రామానికి చెందిన గ్రామ సర్పంచు ఫణిభూషణ్‌రెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మహిళలకు వైద్య చికిత్సలు నిర్వహిస్తున్న డాక్టర్ సింధుప్రియ

వెలుగోడు: ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సింధుప్రియ మహిళలకు సూచించారు. స్కానింగ్ డే సందర్భంగా బుధవారం ఓపీకి వచ్చిన మహిళలకు ఆమె అవగాహన కల్పించారు. గర్భిణులు మూడు నెలల నుంచి ప్రతి నెల చెకప్ చేయించుకుని మందులు వాడాలన్నారు.

దొంగ వస్తువులను కొనుగోలు చేయొద్దు



గుజిరి షాపుల యజమానులకు సూచనలిస్తున్న సీఐ రాము

ఆత్మకూరు: దొంగ వస్తువులను కొనుగోలు చేయొద్దని సీఐ రాము గుజిరీ షాపుల యజమానులకు సూచించారు. బుధవారం గుజిరిషాపుల యజమానులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా వచ్చి పాత సామాన్లు విక్రయిస్తే ముందుగా విచారణ చేయాలన్నారు. అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

నందికొట్కూరు: శ్రీకాకుళం పోరాట యోధుడు కామ్రేడ్ పైలా వాసుదేవరావు వర్ధంతి సభ పోస్టర్లను సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి నరసింహులు ఆవిష్కరించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి పైలా వాసుదేవరావు కూడగట్టి ఉద్యమాన్ని కొనసాగించారన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట పూజలు

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో గురువారం నుంచి ఈనెల 12 వరకు విగ్రహ ప్రతిష్ట పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ గ్రామంలో సుంకులా పరమేశ్వరి, జంబులా పరమేశ్వరి, గంగమ్మ, లింగమయ్య నూతన ఆలయ, విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

ఏప్రిల్ కోటా కోత!

- కందిబేడలు, చక్కెర కట్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రేషన్‌కార్డుదారులు

జూపాడుబంగ్లా: తాము అధికారంలోకి వస్తే అది చేస్తాం..ఇది చేస్తామంటూ కూటమి నేతలు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. గద్దెనెక్కిన తర్వాత హామీల సంగతి గాలికొదిలేసి ఉన్న పథకాలకే ఎసరు పెట్టారు. ఏప్రిల్ మాసానికి రేషన్‌కార్డులకు ఇవ్వాల్సిన కందిబేడలు, చక్కెరలో కోత విధించారు. బహిరంగ మార్కెట్లో కందిబేడలు కిలో రూ.140, చక్కెర కిలో రూ.45 ఉంది. ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డుదారులకు కందిబేడలు కిలో రూ.69, అర కిలో చక్కెర రూ.17 చొప్పున రాయితీపై అందజేయాల్సి ఉండగా ఏప్రిల్ మాసానికి కూటమి ప్రభుత్వం నిలిపేసింది. కేవలం కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యం మాత్రమే పంపిణీ చేసి రాష్ట్రప్రభుత్వం చేతులు దులిపేసుకుంది.

నందికొట్కూరు నియోజకవర్గం వ్యాప్తంగా 87,554 రేషన్‌కార్డులుండగా 498 క్వింటాళ్ల కందిబేడలు, 45 క్వింటాళ్ల చక్కెర మంజూరు కావాల్సి ఉంది. జూపాడుబంగ్లా మండలంలో 12,593 కార్డులకు గాను 93 క్వింటాళ్ల కందిబేడలు, నందికొట్కూరులో 25,533 రేషన్‌కార్డులకు గాను 165 క్వింటాళ్ల కందిబేడలు, పగిడ్యాలలో 11,384 కార్డులకు 58 క్వింటాళ్లు, మిడుతూరులో 13,611కార్డులకు గాను 69క్వింటాళ్లు, కొత్తపల్లిలో 10,352 కార్డులకు గాను 50 క్వింటాళ్లు, పాములపాడులో 14,081 కార్డులకు గాను 63 క్వింటాళ్ల చొప్పున కందిబేడలు మంజూరు చేయాల్సి ఉంది. ఏప్రిల్ మాసానికి సంబంధించి డీలర్లు డీడీలు చెల్లించినా స్టాక్ లేదని పేర్కొంటూ ఏ ఒక్క మండలానికి కందిబేడలు మంజూరు చేయలేదు. నెలకో పర్యాయం ఇచ్చే కిలో కందిబేడలు, అర కిలో చక్కెర కూడా ఇవ్వకపోతే అధిక ధరలు వెచ్చించి నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేమంటూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న తెల్లరేషన్‌కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తాటిపాడులో ఎండీయూ వాహనం వద్ద నిత్యావసర వస్తువుల కోసం గుమికూడిన కార్డుదారులు

దీనికితోడు రేషన్‌బియ్యంలో మూడు కిలోల బియ్యం తగ్గించి ఇస్తున్న జొన్నలు కూడా ఇవ్వకుండా కేవలం ఓ కార్డుదారికి ఐదు కిలోల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉచిత రేషన్‌బియ్యం వేసి కూటమి ప్రభుత్వం చేతులు దులుపుకోవటంతో రేషన్‌కార్డుదారులు కూటమి ప్రభుత్వం వైఖరిపై మండిపడుతున్నారు. ఈవిషయమై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కుమార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు.

శేషవాహనంపై శ్రీరంగనాథుడు





ప్రత్యేక అలంకరణంలో శ్రీలక్ష్మీరంగనాథస్వామి, లక్ష్మీదేవత అమ్మవారు

జూపాడుబంగ్లా: ఏడాది పొడవునా పొలం పనులు చేసుకొనే మాకు నాగయ్య(నాగుపాము)ల నుంచి ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా కాపాడవయ్యా శ్రీలక్ష్మీరంగనాథా అంటూ భక్తులు స్వామివారిని శరణుకోరి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం శ్రీలక్ష్మీరంగనాథస్వామి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా శ్రీరంగనాథస్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీలో మోసుకుంటూ వెళ్లి శేషవాహనంతో అలంకరించిన గ్రామోత్సవరథంపై ఆశీనులను చేశారు. ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి భక్తుల జయజయ ధ్వానాల మధ్య గోవింద నామాన్ని స్మరిస్తూ స్వామివారి గ్రామోత్సవ రథాన్ని పురవీధుల్లో తిప్పారు. కాగా స్వామివారి శేషవాహనోత్సవానికి ప్రత్యేక ఉంది. ప్రజలు, రైతులు పొలం గట్లవెంట తిరిగేటప్పుడు నాగశేషుని నుంచి ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా శేషవాహనం రోజున స్వామివారికి మల్లెపూలలను సమర్పించి ప్రత్యేకంగా మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

నేడు హనుమద్వాహనసేవ

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజు గురువారం హనుమద్వాహనసేవ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఈశ్వరరెడ్డి, చైర్మన్ నారాయణరెడ్డి, ఈఓ సాయికుమార్ తెలిపారు.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న వృషభాలు

కొత్తపల్లి: మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మంగళవారం గ్రామ పెద్దలు 6 పళ్ల విభాగం వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 11 ఎద్దుల జతలు పాల్గొన్నాయి. మిడుతూరు సాయివర్ధన్ వృషభాలు విజేతగా నిలిచి రూ.40 వేలు కైవసం చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా ఈడిగోనిపల్లికి చెందిన వంశీకృష్ణ, గూడెం దొడ్డి గ్రామానికి చెందిన సహదేవుడు ఎడ్ల జత రెండవ స్థానంలో నిలిచి రూ.30 వేలు గెలుపొందాయి. వైఎస్సార్ జిల్లా దాసరి పల్లె గ్రామానికి చెందిన అశోక్ వృషభాలు మూడో స్థానం దక్కించుకుని రూ.20 వేలు సొంతం చేసుకున్నాయి. నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి చెందిన దండు రైడర్స్ వృషభాలు నాలుగవ స్థానంతో సరిపెట్టుకుని రూ.15 వేలు దక్కించుకున్నాయి.

మట్టి అక్రమ తవ్వకాలపై లోకాయుక్తకు ఫిర్యాదు

మహానంది: గోపవరం గ్రామ సమీపంలోని బైరవాణి చెరువులో జరిపిన ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు, విచ్చలవిడిగా ప్రధాన రోడ్డుపైనే బెల్టుషాపుల నిర్వహిస్తూ మద్యం డోర్ డెలివరీ చేస్తున్న వైనాలపై గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పుల్లయ్య యాదవ్, గ్రామస్తులు లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం వారు కర్నూలులోని లోకాయుక్త, ఎస్‌ఎస్‌హెచ్‌ఆర్‌సీ కార్యాలయాలకు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా పుల్లయ్య యాదవ్ మాట్లాడుతూ మట్టి అక్రమ తవ్వకాలు, బెల్టుషాపులు నిర్వహిస్తున్నా ఏ మాత్రం చర్యలు తీసుకోకపోగా ప్రోత్సహిస్తున్న సంబంధిత అధికారులపై ఫిర్యాదు చేశామన్నారు.



లోకాయుక్త కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు

గ్యాస్ సిలిండర్‌తో నిరసన

నందికొట్కూరు: పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద గ్యాస్ సిలిండర్‌తోప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పుడు గ్యాస్ ధర పెంచడం సామాన్యులపై మరింత భారం మోపడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి గ్యాస్ ధర తగ్గేంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజలు

తూతూమంత్రంగా మండల సమావేశం

- ఎంపీపీతోపాటు ముగ్గురు ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్ హాజరు
- రెండో రోజూ గైర్హాజరైన వైఎస్సార్‌సీపీ సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని

మహానంది: ప్రొటోకాల్ వివాదం, ప్రభుత్వ కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం లేకపోవడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో వైఎస్సార్‌సీపీ సభ్యులెవరూ హాజరుకాకపోయినా మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి జరగాల్సిన సమావేశానికి అధికారులు హాజరైనప్పటికీ మధ్యాహ్నం వరకు కోరం లేక వేచి ఉండి అనంతరం ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు, ఒక కోఆప్షన్ మెంబర్‌తో సమావేశం మధ్యాహ్నం 1.45 గంటలకు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ తాగునీటి సమస్యల్లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను మెరుగు పరచాలన్నారు. విద్యుత్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా మాట్లాడుతూ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ వేణుకార్తికేయ, ఎంఈఓ రామసుబ్బయ్య, ఈఓఆర్‌డీ నాగేంద్రుడు, పీఆర్ ఏఈ రాజశేఖరరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ పొందేందుకు అర్హత కలిగిన ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఈబీసీ విభాగాలకు సంబంధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతులు, సాధికారత అధికారిణి లక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. అభ్యర్థులు వారివారి సొంత జిల్లాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని, వారు పూరించిన దరఖాస్తుకు కుల, నేటివిటీ, ఆదాయ, టెట్ అర్హత సాధించిన రుజువు పత్రం ఎన్‌క్లోజర్లతో సంబంధిత డీబీసీడబ్ల్యూఈఓకు సమర్పించాలన్నారు. ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత కార్యాలయంలో అందజేయాలన్నారు.

శాస్త్రీయ సదస్సులతో పరిశోధన శక్తి వృద్ధి

నంద్యాల(అర్బన్): ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే శాస్త్రీయ సదస్సులు విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుతాయని ఇందిరాగాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఫర్ ఉమెన్ (ఐజీటీటీయూడబ్ల్యూ) ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ రామనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం తెలఏఐ బోధన–సహకార అభివృద్ధి వ్యూహాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మధ్య సహకార అభ్యసనాన్ని ప్రోత్సహించాలన్నారు. పరస్పర మేధస్సు మార్పిడి, పరిశోధనల ప్రోత్సాహాలతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ దినేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

పాములపాడు: ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు గైర్హాజరవ్వడంతో సర్వసభ్యసమావేశం వాయిదా పడింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 8న నిర్వహించాల్సి సర్వసభ్య సమావేశం కోరం లేక బుధవారంరానికి వాయిదా పడింది. బుధవారం కూడా సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో మరోసారి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.

- పగిడ్యాల: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 15వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 11న నిర్వహించనున్న మండల సర్వసభ్యసమావేశాన్ని అనివార్యకారణాలతో వాయిదా వేశామని, అధికారులు, ప్రజాప్రతినిధులు గమనించాలని సూచించారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి

పాములపాడు: ప్రజా సమస్యలపై అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయితీపై వ్యవసాయ యంత్రాలు రోటావేటర్, స్ప్రేయింగ్ పంపులను రైతులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూలోనే ఎక్కువగా సమస్యలు వస్తున్నాయన్నారు. 9 నెలల నుంచి సమావేశాలకు గైర్హాజరవుతున్న ట్రాన్స్‌కో ఏఈని బదిలీ చేసి వేరొకరిని నియమించాలని సంబంధిత అధికారికి సూచించారు. అనంతరం 45 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, ట్రాన్స్‌కో ఏడీ రామసుబ్రహ్మణ్యం, ఏడీఏ ఆంజనేయ, ఏఓ ఫణీశ్వరరెడ్డి, జేఈ రాఘవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మాన్యం భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలి

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని రజకులకు పూర్వం కేటాయించిన మాన్యాలను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక ఐలమ్మ విగ్రహం వద్ద మాట్లాడారు. కలెక్టర్ స్పందించి ఆక్రమణకు గురైన ధోబీ ఘాట్ల స్థలాలు, మాన్యం భూములను తిరిగి రజకులకు అప్పగించాలని కోరారు. లేని ఎడల ఆందోళనలు చేపడతామన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి

బండిఆత్మకూరు: ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామన్నారు. రైతుల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ స్టేషన్‌లో వేలంపాట

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేయబడిన మూడు ద్విచక్ర వాహనాలకు గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న వారు వేలం పాటల్లో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు 9440902585, 9177299067, 8328307774 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

ఉచిత ఎంసెట్ తరగతులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత ఎంసెట్ కోచింగ్ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న బుధవారం తెలిపారు. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులతోపాటు ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్న సైన్స్ విద్యార్థులు కళాశాలలో నిర్వహించే తరగతులకు హాజరుకాలన్నారు. ఈఏపీసెట్–25 పరీక్షల కోసం విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు.

13న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం అంచె వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఈనెల 13న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మీ సేవా, నెట్ సెంటర్ల వద్ద హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటలకు, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్నం 1 గంటకు పరీక్షా ప్రారంభమవుతుందన్నారు. హాల్‌టికెట్‌తోపాటు ఆధార్‌కార్డు, బ్లూ కలర్ లేదా బ్లాక్ కలర్ బాల్‌పెన్ తెచ్చుకోవాలన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

వెలుగోడు: భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ రైతులకు సూచించారు. పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.



మట్టి నమూనాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

రెగ్యులర్ డీలర్‌ను నియమించాలి

నందికొట్కూరు: మండలంలోని దామగట్ల గ్రామంలో రెగ్యులర్ రేషన్ డీలర్‌ను నియమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘం నాయకులతో కలిసి ఆయన గ్రామాన్ని సందర్శించారు. పక్కీర్‌సాహెబ్ మాట్లాడుతూ రెగ్యులర్ రేషన్ డీలర్ లేకపోవడం, ఎండీయు వాహనం లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రేషన్ బియ్యం కోసం పక్కనున్న గ్రామానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులకు పలు మార్లు ప్రజలు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గోపాలక్రిష్ణ, అల్లబకాష్, చంద్రకళ, నాగేశ్వరమ్మ, రామసుబ్బమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

పథకాల అమలు లక్ష్యాలను పూర్తి చేయాలి

మహానంది: ప్రభుత్వ పథకాల అమలులో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సూర్యఘర్ పథకం, గృహనిర్మాణాలు, ఉపాధి హామీ పథకం, సిటిజన్ సర్వేలపై అధికారులకు సూచనలిచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ మహబూబ్ దౌలా, విద్యుత్‌శాఖ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ వెంకటరెడ్డి, వెలుగు ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, ఏపీఓ మల్లికార్జున పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు: మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 550 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్, సివిల్ పోలీసులు ధ్వంసం చేశారు. అనంతరం గ్రామంలో 2.0 నవోదయ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ భాష్యం శ్రీనివాసులు మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా నాటు సారా తయారు చేయడం నేరమన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా, ఇతర ప్రాంతాలకు తరలించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

- ఆర్డీఓ డి.నాగజ్యోతి

ఆత్మకూరు: బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ డి.నాగజ్యోతి హెచ్చరించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహ వయస్సు ఆడపిల్లలకు 18, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండి ఉండాల్నారు. బాల్యవివాహల వల్ల చాలా నష్టాలున్నాయన్నారు. గ్రామస్థాయిలో మహిళా పోలీసు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, స్కూల్ టీచర్లు బాల్యవివాహ నిషేధ చట్టం గురించి అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతుందని తెలిసినా, చూసినా వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 100, 181 నంబర్‌లకు కాల్ చేసి చెప్పవచ్చన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి గ్రామం, వార్డుల్లో చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీని ప్రతినెల మొదటి, మూడో శుక్రవారం మహిళా సంరక్షణ కార్యదర్శి నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి ఎ.దర్గయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరి, ఎంపీడీఓ నాగభూషణం శెట్టి, ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, కొత్తపల్లి తహసీల్దార్ ఉమాదేవి, సీఐ రాము, డిప్యూటీ డీఎంహెచ్ఓ కాంతారావునాయక్, డాక్టర్ రాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి



హాజరైన అధికారులు